క్లుప్తంగా

ఆలయాల్లో చోరీ

కురవి: మండల కేంద్రంతోపాటు కొత్తూరు(జీ) శివారు తాట్య తండా జీపీలో రెండు ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కురవిలోని అష్ట లక్ష్మీ సమేత శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఆలయంలో ఉన్న ప్రధాన హుండీని గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. గుడిలో స్వీపర్‌గా పనిచేస్తున్న గోరు గంగ ప్రతీ రోజు మాదిరిగా శుక్రవారం ఉదయం ఆలయం ప్రధాన గేట్ తాళం తీసి లోనికి వెళ్లింది. ఆలయ ఆవరణలో హుండీ కనిపించకపోవడంతో ఆలయ నిర్వాహకులకు సమాచారం అందచేసింది. వారు పోలీసులకు సమాచారం అందచేయగా ఎస్సై మధుబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలను సేకరించారు. కాగా హుండీని ఎత్తుకెళ్లిన దుండగులు మొగిలిచర్ల గ్రామ శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్ద పడేసి వెళ్లిపోయారు. ఆలయ నిర్వాహకులకు హుండీని తీసుకొచ్చి ఆలయంలో భద్రపరిచారు. విషయాన్ని పోలీసులకు వివరించినట్లు తెలిపారు. కొత్తూరు(జీ) శివారు తాట్య తండా గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీని ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. గుర్తు తెలియని దొంగలు హుండీని ఎత్తుకెళ్లి అందులో ఉన్న రూ.30వేల నగదు, పావుకిలో వెండిని ఎత్తుకెళ్లారు. ఎస్సై మధుబాబు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కురవి మండలంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు నిఘాలోపం స్పష్టమవుతోందని ప్రజలు అంటున్నారు.

అదనపు కట్నంపై కేసు నమోదు

గార్ల: అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యను తరచూ వేధిస్తున్న భర్తపై కేసు నమోదైన సంఘటన శుక్రవారం రాజుతండాలో చోటుచేసుకుంది. ఎస్సై బానోత్ వెంకన్న కథనం ప్రకారం వివరాలు.. గార్ల మండలం మర్రిగూడెం గ్రామంకు చెందిన చిత్ర, రాజుతండాకు చెందిన బానోత్ శ్రీనివాసరావుతో 2009 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరు ప్రేమించుకొని ఇరుపక్షాల కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం. కాగా గత కొంతకాలం నుంచి భార్యను అదనపు కట్నం తీసుకురావాలని భర్త శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడు. 2 రోజుల క్రితం భార్యతో గొడవపడి భర్త ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. భర్త వేధింపులు తాళలేక భార్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై భర్తపై అదనపు కట్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం

చిన్నగూడూరు: మండలకేంద్రానికి చెందిన ఓవ్యక్తి ఎంపీడీఓ కార్యాలయంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు వడ్లకొండ ఆదామ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక హైస్కూల్ ప్రక్కన చికెన్ షాప్ నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నానని, మందస్తుమాచారం లేకుండా సర్పంచ్ మల్లయ్య, కార్యదర్శి శ్రీనువాస్‌రెడ్డి షాప్‌ను తొలిగించాలని నోటీసులు పంపించారన్నారు. తమకు నోటీసులు ఇచ్చినందుకు ఆత్మహత్యాయత్నం చేశానన్నారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుల ఒత్తిడితోనే నోటీసులు పంపినట్లు ఆయన ఆరోపించారు. ఇదే విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా స్కూల్ ఆవరణలో చికెన్ షాప్ ఉండడంతో వ్యర్థాలతో దుర్వాసన వస్తుందన్నారు. దీంతో నోటీసులు పంపినట్లు తెలిపారు. యజమానితో మాట్లాడి సర్పంచ్‌తో నోటీసులు వాపస్ తీసుకునట్లు ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కొత్తగూడ: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గాంధీనగర్ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం మండలం మిర్రిగూడెం గ్రామానికి చెందిన సువర్ణపాక సమ్మయ్య తన ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్తుండగా మలుపు వద్ద అదుపుతప్పి పడిపోయాడు. ఈఘటనలో సమ్మయ్య తలకు తీవ్రంగా గాయం అయ్యింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి నర్సంపేట ఆసుపత్రికి తరలించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

గార్ల: మండలంలోని మూడు తండాకు చెందిన మాలోత్ భాస్కర్(38) వడదెబ్బకు గురై శుక్రవారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని పీక్లీతండాలో శుభకార్యానికి వెళ్లి భోజనం చేసి మధ్యాహ్నం కాలినడకన ఇంటికి వస్తుండగా ఫిట్స్ రావడంతో ఎండతీవ్రతకు రోడ్డు పక్కన పంటపొలంలో పడి మృతిచెందాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

వానరం దాడిలో వృద్ధురాలికి గాయాలు

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో నేరేడ్ల లచ్చమ్మ అనే వృద్ధురాలిపై శుక్రవారం వానరాలు దాడిచేసి గాయపర్చాయి. కాలిపై వానరాలు కరవడంతో తీవ్ర రక్తస్రావమవుతుండగా, సమాచారం మేరకు వచ్చిన స్థానిక వైద్యులు చికిత్స చేశారు.

మరిపెడ పట్టణ సుందరీకరణకు కృషి

● డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్



డోర్నకల్: మాట్లాడుతున్న చైర్మన్ వీరన్న



మరిపెడ: బతుకమ్మలు, బోనాలతో ర్యాలీ తీస్తున్న చైర్‌పర్సన్, మహిళలు

మరిపెడ: మరిపెడ పట్టణ సుందరీకరణకు కృషి చేస్తానని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మరిపెడలో పట్టణ ప్రగతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు సింధూర ఆధ్వర్యంలో బతుకమ్మ, బోనాలతో పట్టణ కేంద్రంలోని కార్గిల్ సెంటర్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల నృత్యాలు, కోలాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పల్లె, పట్టణం తేడా లేకుండా ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. మరిపెడను మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎంపిక చేసి కేసీఆర్ ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల జిల్లా పర్యటనలో సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఈ నిధులతో పట్టణ సుందరీకరణ పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, జెడ్పీటీసీ తేజావత్ శారదరవీందర్‌నాయక్, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, బాల్ని మాణిక్యం, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతితో అభివృద్ధి బాట

డోర్నకల్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పట్టణ ప్రగతి కార్యక్రమంతో పట్టణాలు, మున్సిపాలిటీలు అభివృద్ధి బాట పడ్డాయని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణప్రగతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, మెప్మా, మున్సిపాలిటీ సిబ్బంది, ఆశకార్యకర్తలు గాంధీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన తరువాత జెడ్పీహెచ్‌ఎస్ వరకు ర్యాలీ నిర్వహించారు. జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ వీరన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ శాఖల సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తెలంగాణ ఆకృతి

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో శుక్రవారం చిత్రించిన తెలంగాణ రాష్ట్ర ఆకృతి ఆకట్టుకుంది. మెప్మా సిబ్బంది రూపొందించిన ఆకృతిని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కమిషనర్ మున్వర్ అలీ, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం మరియా మాణిక్యం పరిశీలించారు.

కుంట ధ్వంసంపై చర్య తీసుకోవాలి



ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు

మరిపెడ రూరల్: మండలంలోని పాంబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కుంటను ధ్వంసం చేసి, చదును చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదేతండాగా గిరిజన రైతులు డిమాండ్ చూశారు. ఈమేరకు జేసీబీతో ధ్వంసం చేసిన కంటవద్ద గిరిజన రైతులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు భూక్య వీరన్న, అజ్మీర కిషన్, భూక్య మేగ్య, పెద్దవీరన్న, రూప్లా, యాకసాయిలు, గజ్జి నాగయ్య మాట్లాడుతూ.. పాంబండతండా శివారులోని మూడు ఎకరాల విస్తీర్ణంలో కుంట నిర్మించి 40 ఏళ్ల క్రితం నుంచే నిర్మించారన్నారు. ఇట్టి కుంటను పక్క గ్రామమైన మండలంలోని గిరిపురం గ్రామానికి చెందిన గట్ల వెంకన్న అనే వ్యక్తి కుంట నాకు పట్టా ఉందని, తండావాసులు లేని సమయంలో జేసీబీతో కుంట కట్టను ధ్వంసం చేశాడని తెలిపారు. ఈ కుంట కింద సుమారు 30ఎకరాలు పంట భూములకు సాగు నీరు అందుతుందన్నారు. అదేవిధంగా మూగ జీవాలు దాహం తీర్చుకుంటాయని తెలిపారు. ఈవిషయంపై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల తోపాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో టేకు చెట్లు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన టేకు చెట్లు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సోమ్లాతండా సమీపంలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలోని టేకు చెట్లు దగ్ధమయ్యాయి. తండా సమీపంలో వ్యవసాయ భూముల్లో మంటలు చెలరేగి ప్రక్కనే టేకు వనంలోకి మంటలు వ్యాపించాయి. అక్కడే రైల్వే ట్రాక్ ఉండడంతో చెట్లు పిచ్చి మొక్కలు కాలుతూ మంటలు రైలు పట్టాల సమీపానికి వెళ్లాయి. మున్సిపల్ చైర్మన్ వీరన్న ఆర్‌పీఎఫ్ ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీటిని మంటలపై చల్లారు. సోమ్లాతండాకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముళ్ల పొదలకు వెళ్లి బకెట్లతో నీళ్లు చల్లి మంటలను ఆర్పారు. గురువారం రాత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంటలు చెలరేగి విద్యుత్ సరఫరా నిలిచింది.

మామిడి చెట్లు దగ్ధం

మండలంలోని కస్నాతండా సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు తమ మామిడి తోటను ఉద్దేశపూర్వకంగా దగ్ధం చేశారని బాధితుడు కుమారస్వామి ఆరోపించాడు.

ఇందిరమ్మ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ పాలన రావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావాలని టీపీసీసీ ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఇంటింటికి రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సందేశ్ కార్యక్రమాన్ని మహబూబాబాద్ మండలంలోని వీఎస్ లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ఓబీసీ మండల అధ్యక్షుడు పుణ్యపుర్తి ఐలయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో మన సొమ్మును దోచుకుని తినే ప్రభుత్వాలే ఉన్నాయన్నారు. రైతు కుటుంబంలో వెలుగులు నింపేందుకు పార్టీ అధికారంలోకి రాగానే వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రవేశపెడుతుందన్నారు. కార్యక్రమంలో ముదారి బుచ్చయ్య, లింగన్న, నరేష్, మహేష్, రవి, యాకన్న, పాపన్న, హరీశ్ పాల్గొన్నారు.

జీపీ నిర్మాణానికి భూమి పూజ

పెద్దవంగర: దశాబ్ది ఉత్సవాలల్లో భాగంగా మండలంలోని చిట్యాల గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి భూమి పూజ నిర్వహించారు. ఈజీఎస్ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు కాగా భవన నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ఉప సర్పంచ్ లచ్చమ్మ, జీపీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు సుదర్శన్, వసంత, కొండెల్లి, సోమయ్య, రామచంద్రు, యాకయ్య, హరీష్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన



రామకృష్ణారావుపై దాడి చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం శివారులోని పాలకేంద్రం సమీపంలో కారు ఢీకొని మృతి చెందిన కుణుసోత్ సరోజ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబీకులు, బంధువులు శుక్రవారం ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి సరోజ మృతి చెందగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆమె మృతికి కారణమైన కారు నడిపిన వ్యక్తి బంధువు రామకృష్ణ మెడికల్‌స్టోర్స్ వద్ద వారు షాపు యజమాని రామకృష్ణారావు, ఆయన అన్న కుమారుడు ప్రమోద్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. సదరు షాపు అద్దాలను, సామగ్రిని ధ్వంసం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారించే ప్రయత్నం చేశారు. అనంతరం రామకృష్ణరావును పోలీసు వాహనంలో టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా బాధిత కుటుంబీకులు కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కాగా కారు యాక్సిడెంట్ చేసిన వ్యక్తి దుగ్యాల శ్రీధర్‌రావు కాగా తనను, తన అన్న వెంకటేశ్వర్‌రావు, ఆయన కుమారుడు ప్రమోద్‌కుమార్‌ను అకారణంగా దూషిస్తూ దాడి చేసి గాయపర్చారని పొనుగోటి రామకృష్ణారావు టౌన్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గొడవకు బాధ్యులైన దేవేందర్, హరి, మదన్, సుధాకర్, నంద్యా అనే వ్యక్తులపై దౌర్జన్యంగా దాడి చేసి ఆస్తినష్టం, పరువునష్టం కలిగించారని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. టౌన్ సీఐ వై.సతీష్‌ని వివరణ కోరగా రామకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

జిల్లా కేంద్రం శివారులోని పాలకేంద్రం సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనలో కుణుసోత్ సరోజ మృతికి కారణమై, కారు నడిపిన వ్యక్తి దుగ్యాల శ్రీధర్‌రావుపై కేసు నమోదు చేశామని రూరల్ ఇన్‌చార్జ్ ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

గార్ల: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బస్సు జాతా ప్రారంభ సభ కరపత్రాలను శుక్రవారం ఆయన గార్లలో ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు కావస్తున్నా పేదవాడికి సొంత ఇల్లు లేదన్నారు. ఈనెల 18న మానుకోటలో నిర్వహించే రాష్ట్ర వ్యాప్త బస్సు జాతా ప్రారంభ సభకు జిల్లా నలుమూలల మండలాల నుంచి సీపీఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు బిక్షం, కోటయ్య, రాంబాబు, శ్రీనివాస్, రామకృష్ణ, ఎల్లయ్య, అంజయ్య, ప్రసాద్, సర్వేశ్వరరావు, సాయి, వెంకన్న, రాము, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

తొర్రూరు రూరల్: బీఆర్‌ఎస్ రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని గుర్తూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దేవరకొండ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతోనే పార్టీని వీడుతున్నానని, తన భవిష్యత్ రాజకీయ కోసమే పార్టీకి రాజీనామా చేశానని, రాజీనామా లేఖను మండల పార్టీ అధ్యక్షుడికి పంపించన్నారు. త్వరలో తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను అరికట్టాలి



మాట్లాడుతున్న మహేందర్

తొర్రూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బందు మహేందర్, ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలోతు సురేష్‌బాబులు డిమాండ్ చేశారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్, ఆమ్‌ఆద్మీ విద్యార్థి విభాగం, పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోటుబుక్స్ బహిరంగంగా అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు బానోతు శేఖర్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధాన్యం తరలిస్తున్న డీసీఎం బోల్తా

కొత్తగూడ: ధాన్యం తరలిస్తున్న డీసీఎం బోల్తా పడ్డ సంఘటన మండలంలోని గుంజేడు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలానికి చెందిన ఓ వ్యాపారి తన ధాన్యం డీసీఎంలో భూపతిపేటకు తరలిస్తుండగా మలుపు వద్ద బోల్తా పడింది. సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ధాన్యం బస్తాలను మరో వాహనంలో తరలించారు.

ఆర్థికసాయం

తొర్రూరు: మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుడిమళ్ల వెంకటేశ్వర్లు ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులకు భవన నిర్మాణ కార్మికుల యూనియన్ తరపున సమకూర్చిన రూ.15వేలు శుక్రవారం తొర్రూరులో అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శివరాత్రి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్మరాజుల వెంకన్న, ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

కేసముద్రం: ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన వారి వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయంలో కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో తహసీల్దార్ సాంబశివుడికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి సలీం మాట్లాడారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నెల్లికుదురు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని తారాసింగ్ బావి తండాకు చెందిన గుగులోతు యాకూబ్ 20రోజుల క్రితం సెల్ ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ గుర్తించి బాధితుడికి అందించినట్లు ఎస్సై తెలిపారు.

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

బయ్యారం: కాకతీయుల కాలంలో నిర్మించిన బయ్యారం పెద్దచెరువు కాల్వలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి మెకాళ్ల మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మట్లాడారు. సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, భిక్షం, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీకి ఆటంకం

దోర్నకల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు కారణాలతో బీసీ రుణాల కోసం అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీకి ఆటంకం కలుగుతోంది. ఈనెల 20తో గడువు ముగుస్తుండటంతో అధికారులు స్పందించి సకాలంలో ధ్రువపత్రాలను జారీ చేయాలని కోరుతున్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

దోర్నకల్: కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు మైనుపాషా కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్ మేనేజర్ జి.నాగ్యాను కలిసి కరోనా కాలంలో రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని, పలు రైళ్లకు డోర్నకల్ స్టేషన్‌లో హాల్టు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

విత్తన ప్యాకెట్ల చోరీ

దోర్నకల్: డోర్నకల్ మెయిన్ రోడ్డులోని రైతు మిత్ర ఆగ్రో కెమికల్స్ దుకాణంలో శుక్రవారం ఇద్దరు మహిళలు మిరప విత్తనాల చోరీకి ప్రయత్నించారు. దుకాణ యజమాని భోజనం చేస్తున్న సమయంలో వచ్చిన ఇద్దరు మహిళల్లో ఒకరు యజమానితో మాట్లాడుతున్న సమయంలో మరొకరు మురప విత్తనాల ప్యాకెట్ల డబ్బాను చోరీ చేసి వెళ్లిపోయారు. సీసీ కెమెరాలో చోరీ విషయాన్ని గమనించిన యజమాని మరో దుకాణ యజమానికి సమాచారం అందించి వేర్వేరుగా పట్టణంలో వెళ్తూ ఓ మహిళను రైల్వే స్టేషన్ సమీపంలో మరో మహిళను నిర్మలా స్కూల్ సమీపంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు


కొత్తగూడ: పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంచుతాయని కొత్తగూడ క్లస్టర్ ఏఈఓ రాజు అన్నారు. మండలంలోని కిష్టాపురంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సబ్సిడీలో జీలుగ విత్తనాలు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతలకు టోకెన్లు ఇస్తామన్నారు.

అవార్డులు ప్రదానం



దంతలపల్లి: దశాబ్దిత్సవాలలో భాగంగా గురువారం జరిగిన పల్లెప్రగతి దినోత్సవంలో దంతాలపల్లి గ్రామపంచాయితీ జిల్లాలో 2వ ఉత్తమ పంచాయితీగా అవార్డు దక్కించుకుంది. ఈసందర్భంగా సర్పంచ్ దర్శనాల సుస్మిత మాట్లాడారు. కలెక్టరు కార్యాలయంలో మంత్రి సత్యవతి రాథోడ్ సర్పంచ్ సుస్మిత, కార్యదర్శి లక్ష్మీకాంత్, వనసేవకురాలు, ఎర్రబోయిన వెంకటమ్మను సన్మానించి అవార్డు ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు.

ఎంపీడీఓకు పురస్కారం



దోర్నకల్: డోర్నకల్ ఎంపీడీఓ అపర్ణ జిల్లాస్థాయి ఉత్తమ ఎంపీడీఓగా మంత్రి సత్యవతిరాథోడ్, కలెక్టర్ కె.శశాంక చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మహబూబాబాద్‌లో జరిగిన పల్లెప్రగతి వేడుకల్లో ఉత్తమ ఎంపీడీఓగా అపర్ణ, ఉత్తమ ఎంపీఓగా మీర్జా మున్వర్‌బేగ్ పురస్కారం అందుకోగా ఉత్తమ నర్సరీగా బొడ్రాయితండా గ్రామ నర్సరీ, ఉత్తమ కంపోస్ట్ షెడ్ పురస్కారాన్ని వెన్నారం గ్రామపంచాయతీగా ఎంపికై పురస్కారం అందుకున్నారు.

అక్రమ కేసును ఉపసంహరించుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా, పీఓడబ్ల్యూ సంధ్య, అరుణోదయ విమలక్క తదితరులపై అక్రమంగా మోపిన కేసులను వెంటనే ఉపసంహరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన 152 ప్రజా సంఘాలపై ములుగు తాడ్వాయి పోలీసులు రాజద్రోహం కుట్ర కేసు అయిన ఉప కేసును నమోదు చేయడం విస్మయాన్ని కలుగజేస్తుందన్నారు. మావోయిస్టు పార్టీకి అనుబంధ సంఘాల్లో పని చేస్తూ రాజద్రోహానికి పాల్పడుతున్నారని తప్పుడు కేసులు బనాయించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కురవి: ప్రగతిశీల, ప్రజాస్వామ్య, పౌర, రాజ్యాంగా హక్కుల పరిరక్షణ కోనం నిరంతరం పోరాటం చేస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్‌పై బూటకపు కేసును ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ శుక్రవారం డిమాండ్ చేశారు.

గార్ల: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ప్రొఫెసర్ హరగోపాల్, విమల, తదితర మేధావులపై అక్రమంగా, కుట్రపూరితంగా మోపిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జడ ఐలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేరకు శుక్రవారం గార్లలో ఆమె విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం



నెల్లికుదురు: తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించి బడులను కాపాడుకుందామని ఎంఈఓ గుగులోతు రాము పిల్లల తల్లిదండ్రులను కోరారు. శుక్రవారం ఉచిత పాఠ్యపుస్తకాలను పిల్లలకు అందించేందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎమ్మార్సీ కార్యాలయంలో పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రావణి, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బులు జమచేయాలి

కేసముద్రం: రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు వెంటనే జమ చేయాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు గుగులోతు దస్రూనాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట రైతులకు తమ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందంటూ బీఆర్‌ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు.కార్యక్రమంలో ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, ఎండి.అయూబ్‌ఖాన్, పోలెపాక నాగరాజు, ఇస్లావత్ చందు, దారావత్ బాలునాయక్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

కొత్తగూడ: నకిలీ విత్తనాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సభలో ప్రజా ప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. వ్యవసాయ శాఖ పై చర్చ జరుగుతున్న సమయంలో గోవిందాపురం సర్పంచ్ రాజేశ్వర్ మండల సభ దృష్టికి తీసుకుని వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ భారతి పాల్గొన్నారు.

స్కావెంజర్లను నియమించాలి

నెల్లికుదురు: ప్రభుత్వం పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని తెలంగాణ పాఠశాలల స్కావెంజర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలోచించి స్కావెంజర్లను నియమించి పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మహబూబాబాద్: పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రూ.33,68,000 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 107 మంది లబ్ధిదారులకు ఎంపీ అందజేశారు.

నూతన జాతీయ జెండా ఏర్పాటు

సాక్షి స్పందన



జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉన్న భారీ జాతీయ జెండా గురువారం చిరిగిపోగా శుక్రవారం ఉదయం ఆ జెండాను తొలగించి కొత్త జెండాను ఏర్పాటు చేశారు.

- సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్